క్లుప్తంగా

అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: అర్హులైన వితంతువులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిషత్ ఏవో సుదర్శనంకు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న అర్హులకు ఫించన్లు మంజూరు చేయడంలో విఫలమైందన్నారు. ముఖ్యంగా భర్తలు చనిపోయిన వితంతువులకు, వృద్ధులకు పింఛన్లు మంజూరు కావడం లేదన్నారు. కొండగుంపాంలో అర్హులైన వారికి ఇంతవరకు పింఛన్లు మంజూరు కాలేదన్నారు. కాబట్టి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయకపోతే భవిష్యత్తులో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- నగరపాలక సంస్థ సహాయ కమిషనర్



తాగునీటిపై వివరిస్తున్న నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం : తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మయూరి జంక్షన్ నుంచి ప్రారంభమై స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. నాగోజీపేట, తోటపాలెం తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ జీవీ రంగారావుతో కలిసి ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల పైప్ లైన్ లీకేజీలను గుర్తించి, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సచివాలయ కార్యదర్శులను మందలిస్తూ ఇక నుంచి పైప్ లైన్ లీకేజీలు గుర్తిస్తే శ్రీముఖాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలలో చెత్తాచెదారాలు పడి ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. తక్షణమే స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఖాళీ స్థలాల పన్నులను వెంటనే చెల్లించేలా వారిపై ఒత్తిడి తేవాలని చెప్పారు. ఇప్పటికీ పన్నులు విధించని ఖాళీ స్థలాలుగానీ ఇళ్లనుగాని వెంటనే గుర్తించి వాటికి పన్ను విధింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకొని, పన్నులు సకాలంలో చెల్లించాలని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, ఎంఈఓ సత్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువను కప్పేశారు

- రియల్ ఎస్టేట్ వ్యాపారిపై రైతుల ఫిర్యాదు



డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేస్తున్న సీహెచ్ అగ్రహారం రైతులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 60-1,2,3,4,5,6లోని సాగునీటి కాలువను రియల్ఎస్టేట్ యజమానులు కప్పేయడంపై పలువురు రైతులు డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన లక్ష్మణుడు చెరువు సాగునీరు పంట పొలాలకు అందించే సాగునీటి కాలువను రియల్ ఎస్టేట్ యజమానులు కప్పేశారని, దీంతో సాగునీరు అందకపోవడంతో పాటు, వర్షాల సమయంలో పంటలు ముంపునకు గురవుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీటీ స్పందిస్తూ సర్వేయర్ గణపతిరావు, వీఆర్వో గౌసని పంపించి సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వాళ్లె జయరాం, మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు, పిల్ల శ్రీరాములు, గుడివాడ జమరాజు, గుడివాడ అప్పలనర్సి, జి. వెంకటరమణ, సత్యం, గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం రాయితీపై పూలు, పండ్ల మొక్కలు

బొండపల్లి: ఉపాధి హమీ పథకం నిధులతో రైతులకు శతశాతం రాయితీపై పూలు, పండ్ల మొక్కలు అందించనున్నట్లు ఏపీఓ జి.అరుణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులని పేర్కొన్నారు. 25 సెంట్ల నుంచ 5 ఎకరాల్లోపు భూమి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి క్షేత్ర సహాయకులకు గాని ఎంపీడీఓ కార్యాలయంలో గాని దరఖాస్తులు అందించాలని సూచించారు. పట్టాదారు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో పాటు ఆధార్, జాబ్‌కార్డు జిరాక్స్‌లను దరఖాస్తుకు జత చేయాలన్నారు. అలాగే ఏ పంట సాగు చేస్తున్నారో తెలియజేయాలని పేర్కొన్నారు.

గోకులాల్లో బిల్లుల బకాయిలు

- నిర్మాణాలు పూర్తయినా బిల్లులు చెల్లించని వైనం
- ఆవేదనలో పాడి రైతులు
- కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు



భోగాపురం మండలం చాకివలస గ్రామంలో బిల్లు మంజూరు కాని గోకులం షెడ్

పూసపాటిరేగ: ఉపాధిహామీ పథకంలో పాడి రైతులు నిర్మించిన గోకులాలకు బిల్లుల బకాయిలు గుదిబండగా మారాయి. అప్పుచేసి గోకులాలు నిర్మించి ఆరు నెలలు దాటుతున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. 90 శాతం రాయితీ ఉందని, కేవలం 10 శాతం మాత్రమే లబ్ధిదారుని వాటాగా నిర్ణయించడంతో హడావిడిగా గోకులంషెడ్లను నిర్మించినా బిల్లులు మంజూరు కాక ఆవేదన చెందుతున్నారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామని వాపోతున్నారు. పాడి రైతులకు గత ఏడాది డిసెంబర్‌లో గోకులాలు మంజూరయ్యాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 232 వరకు గోకుల షెడ్లు మంజూరు కాగా 155 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉపాధిహామీ ఏపీఓ, ఎంపీడీఓ, పశుసంవర్ధక శాఖ ఏడీ, పశు వైద్యాధికారి, వెలుగు ఏపీఎంలతో కూడిన కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసింది. అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే కేటాయించారన్నది బహిరంగ రహస్యం. షెడ్లు నిర్మాణాలకు 2 పశువులు షెడ్‌కు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు షెడ్‌కు రూ.1.83 లక్షలు, ఆరు పశువులు షెడ్‌కు రూ.2.30 లక్షలు అంచనా వ్యయంగా నిర్ణయించారు. ఇందులో రైతు వాటా 10 శాతంకాగా, 90 శాతం రాయితీ వర్తిస్తుంది. దీంతో అధికారపార్టీకి చెందిన గ్రామీణ స్థాయి నాయకులు తమ అనుచరులకు మంజూరు చేయించారు. పూసపాటిరేగ మండలంలో 52 గోకులాలు మంజూరు కాగా వాటిలో 31 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఆ నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.32 లక్షలు వరకు బకాయిలు పడ్డాయి. నెల్లిమర్లలో 31 గోకులాలు మంజూరు కాగా వాటిలో 21 వరకు నిర్మాణాలు పూర్తి చేశారు. సుమారు రూ.10 లక్షలు వరకు పాడిరైతులకు చెల్లించాల్సి ఉంది. భోగాపురం మండలంలో 86 గోకులాలు మంజూరు కాగా వాటిలో 50 వరకు గోకులాలు నిర్మాణాలు పూర్తి చేశారు. వాటికి రూ.33 లక్షల వరకు బకాయిలు ఉన్నట్టు తేలింది. డెంకాడ మండలంలో 63 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వాటిలో 52 షెడ్లుపూర్తయ్యాయి. సుమారు 35 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు 155 వరకు గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా రూ.1.20 కోట్లు వరకు లబ్ధిదారులకు బిల్లుల బకాయిలు ఉన్నాయి.

బిల్లులు మంజూరు కావడం లేదు

గోకులం షెడ్డు మంజూరైంది. నిర్మించాలంటూ అధికారులు ఒత్తిడి తెచ్చారు. అప్పుచేసి నిర్మించాను. గత ఏడాది డిసెంబర్‌లో నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు బిల్లు మంజూరు చేయలేదు. అప్పుకు వడ్డీ పెరుగుతోంది. ఏం చేయాలో తోచడంలేదు.

– బి.సూర్యనారాయణ, పూసపాటిరేగ

ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



గుంకలాం, కొండకరకంలలో పర్యటించిన నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తదితరులు

విజయనగరం: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఈ నెల 26లోగా పూర్తయ్యే విధంగా పర్యవేక్షించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు గురువారం గుంకలాం, కొండకరకం ప్రాంతాలలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఎంత మేర ఇళ్ల నిర్మాణాలు జరిగాయి, స్లాబ్ వరకు వచ్చిన ఇల్లు ఎన్ని వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని సిబ్బందికి ఆదేశించారు. త్వరలో జరగనున్న గృప్రవేశాలకు సిద్ధం చేయించాలని చెప్పారు. అనంతరం కేఎల్‌పురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదల ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారులకు అదనంగా 50 వేల రూపాయలను ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.మురళీమోహన్, డీఈ జివి.రంగారావు, ఏఈ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

25న కంటి వైద్య శిబిరం

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సాధన యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలుబోతు దుర్గాప్రసాద్, పశుమర్తి వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ నెల 25న జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయడం జరుగుతుందన్నారు. కంటి రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా మండలంలోని మోదవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. మోదవలస, గొండయ్యపాలెం, జరజాపుకల్లాలు, బంగార్రాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరుతో పాటు భోగాపురం మండలంలోని పోలిపల్లి, మహరాజుపేట, రాజపులోవ, చెరుకుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయనగరంలో..

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ పి.త్రినాథ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్‌నగర్, సారిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. బ్యాంక్ కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్ నాగోజీపేట, రైల్వేస్టేషన్ రోడ్, బొత్సపేట, సెంట్రల్ బ్యాంక్ ఏరియా, తిరుమల ఆసుపత్రి ఏరియా, ఆర్‌టీసీ కాంప్లెక్సు ఏరియా, సిద్దార్థనగర్ ప్రాంతాలకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

సాగునీటి ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, అధికారులు

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస వద్ద చంపావతి నదిలో ఉన్న మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరిశీలించారు. ప్రాజెక్టు మరమ్మతులకు గురి కావడంతో సాగు నీరు రావడం లేదని రైతులు ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాజెక్టు పాడవ్వడం వలన కల్వర్టు మీదుగా రావాల్సిన నీరు నేరుగా నదిలోకి వెళ్లి సముద్రంతో కలిసిపోతుందని రైతులు వివరించారు. దీనిలో భాగంగా సాగునీటి ప్రాజెక్టును, కాలువలను ఆమె గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుంది... ఎక్కడెక్కడ మరమ్మతులకు గురైంది... ఎంత మేరకు నిధులు అవసరం వంటివి ఇరిగేషన్ అధికారుల నుంచి ఆరా తీశారు. ప్రాజెక్టు మరమ్మతులకు కావాల్సిన నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కంది సూర్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాణిరాజు పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



నెల్లిమర్ల: రైల్వేబ్రిడ్జి సమీపంలో ఆంజనేయస్వామికి పూజలు

హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలకు గురువారం భక్తులు పోటెత్తారు. వైకేఎం కాలనీ, బైపాస్‌కాలనీ, హనుమాన్ జంక్షన్, రాయగడ రోడ్డు వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



రామతీర్థంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



భోగాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తపేటలో భారీ అన్న సమారాధన

ప్రజారోగ్య అధికారుల తనిఖీలు



విజయనగరంలో నిషేధిత ప్లాస్టిక్‌ను గుర్తించిన ప్రజారోగ్య అధికారులు వాటిని సీజ్ చేశారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొంపల్లి సాంబమూర్తి నేతృత్వంలో సిబ్బంది ఉడా కాలనీ ఫేజ్ 2, 3 పాల్ నగర్ ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితులను గమనించి పరిసర దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయం, వినియోగాలపై దాడులు చేపట్టారు. దీంతో కొన్ని దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. పారిశుధ్య పర్యవేక్షకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

వేసవి నృత్య శిక్షణా తరగతులు



చిన్నారులకు నృత్యాన్ని నేర్పుతున్న శిక్షకురాలు

విజయనగరం జిల్లా కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వేసవి ఉచిత నృత్య శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీనివాస సేవా సంఘం, శ్రీమయూరి నృత్యాలయం వారు సంయుక్తంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నారు. 160 మంది చిన్నారులు నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



నృత్యం చేస్తున్న చిన్నారులు

తహసీల్దార్‌పై అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు సీతాదేవి, తదితరులు

- హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని తహసీల్దార్
- చెరుకుపల్లి ఇళ్ల స్థలాల లబ్ధిదారుల డిమాండ్

భోగాపురం: ఇళ్ల స్థలాల పట్టాలు ఉన్నప్పటికీ స్థలం చూపించకుండా పదే పదే కార్యాలయానికి తిప్పించుకుంటున్న భోగాపురం తహసీల్దార్ సురేష్‌పై తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని చెరుకుపల్లి గ్రామానికి చెందిన గోక సీతాదేవితో పాటు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు సీతాదేవి మాట్లాడారు. తమకు ఇళ్ల స్థలాలు చూపించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. హైకోర్టు ఇచ్చిన కాపీను తహసీల్దార్‌కు చూపిస్తే అదిగో ఇదిగో అంటూ పలుమార్లు కార్యాలయానికి తిప్పించుకొని స్థలాలు చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దళిత మహిళ అయినందు వలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ తహసీల్దార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సీఐ దుర్గాప్రసాద్ కేసు కట్టనని అగౌరవపరుస్తూ మాట్లాడారని ఆరోపించారు.

పూర్తి ఆధారాలతో అమరావతి హోం శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శికి కూడా ఫిర్యాదు చేశానన్నారు. తనతో పాటు 12 మంది లబ్ధిదారులను ఇదే విధంగా తహసీల్దార్ ఇబ్బంది పెడుతున్నారని, అతనిపై కేసు నమోదు చేసి తమకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెక్కి ఆదినారాయణ, ఉదయ్‌కుమార్, తోగులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి

గజపతినగరం రూరల్: బాలసదనంలో అందుతున్న సేవలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి హెచ్చరించారు. గురువారం స్థానిక బాలసదన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదన్‌లో ఎంతమంది బాలికలు చేరుతున్నారని.. వారికి అందిస్తున్న ఆహారం, వసతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలసదన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని, నిర్వహణ కూడా బాగుందని సిబ్బందిని అభినందించారు. పరిశీలనలో ఆమెతో పాటు సూపర్‌వైజర్లు, సదనం పర్యవేక్షకురాలు సంధ్య, తదితరులు పాల్గొన్నారు.